7

సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 31 । అక్టోబర్ । 2024



న్యూస్‌రీల్

స్టేట్‌హోంను పరిశీలించిన న్యాయమూర్తి

పాలమూరు: జిల్లాకేంద్రంలో ఉన్న స్టేట్ హోంను బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సందర్శించారు. స్థానికంగా ఉన్న మంచినీరు, భోజనం ఇతర సదుపాయాలను పరిశీలించారు. పరిశుభ్రమైన ఆహారం అందించడంతో పాటు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. స్థానికంగా వసతి పొందుతున్న బాలల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సరైన ఆహారం, నాణ్యమైన చికిత్స అందించాలన్నారు. అనంతరం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి బాల్యవివాహాలు, బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి




జడ్చర్ల టౌన్: సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఇంటింటి సర్వేలో ఎలాంటి అవకతవకలకు తావివ్వరాదన్నారు. అంతకుముందు జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి సర్వేపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఎన్యుమరేటర్లుగా అంగన్‌వాడీలను నియమించినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలియజేశారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషిచేయాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ మోహన్‌రావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ, అవగాహనపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కలిగించాలన్నారు. పాన్‌షాప్‌లలో, పోలేపల్లి సెజ్ వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని అప్పుడే నియంత్రించగలుగుతామని అన్నారు. సమావేశంలో డీసీఆర్బీ రమణారెడ్డి, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

11 మంది జీహెచ్‌ఎంలపై సస్పెన్షన్ ఎత్తివేత



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పదిరోజుల క్రితం బదిలీల్లో భాగంగా స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారని జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 11 మంది జీహెచ్‌ఎంలను ప్రభుత్వం సస్పెన్షన్ వేటు పడింది. ఈ క్రమంలో వారు జిల్లా జీహెచ్‌ఎం సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు తాము బదిలీ అయ్యే క్రమంలో నిబంధనలకు అనుగుణంగానే స్పౌజ్ వినియోగించుకున్నామని వివరించారు. దీంతో జిల్లా విద్యాశాఖ నుంచి వివరణ తీసుకున్న అధికారులు వారిని విధుల్లో తిరిగి తీసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు 11 మంది జీహెచ్‌ఎంలు హైదరాబాద్ విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఉత్తర్వులను అందుకున్నారు. సస్పెన్షన్ ఎత్తివేసినందుకు జీహెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి అబ్దుల్ హక్‌లు ఆర్జేడీతో పాటు ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

డీఆర్ ఆకస్మిక తనిఖీ

జడ్చర్ల: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని డిస్ట్రిక్ రిజిస్ట్రార్ రవీందర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు పరిశీలించి విచారించారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ సమ్మయ్య రిజిస్ట్రేషన్లు, తదితర సమాచారాన్ని డీఆర్‌కు నివేదించారు.

వెలుగు దివ్వెలు

- శుభ, సంతోషాలకు సూచిక.. దీపావళి
- చెడుపై గెలిచిన మంచికి ప్రతీకగా సంబరాలు
- నేడు జిల్లావ్యాప్తంగా వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

చీకటి నుంచి వెలుగు వైపు పయనిద్దామని పురాణాలు, శాస్త్రాలు చెపుతున్నాయి. జ్ఞానానికి ప్రతీక అయిన దీపాన్ని వెలిగించి.. మనలోని అజ్ఞానాన్ని దూరం చేసుకోవాలని ధార్మికవేత్తలు ప్రజలను మేల్కొలుపుతారు. దీపాన్ని జ్ఞానానికి, సంతోషానికి, నిర్మలత్వానికి ప్రతీకగా వారు పేర్కొన్నారు. అలాంటి దీపం ప్రాముఖ్యత తెలిపే విధంగా ఏర్పాటు చేసిందే ఈ దీపావళి పర్వదినం. ప్రతి ఏడాది ఆశ్వీయుజ మాసం అమావాస్య రోజు దీపావళి వస్తుంది. గురువారం జిల్లాలో ప్రజలు సంప్రదాయబద్ధంగా ఈ వేడుకలను నిర్వహించుకోనున్నారు. ప్రాంత భేదాన్ని అనుసరించి దీపాలిక, కౌముదీ మహోత్సవం, దివ్వెల పండుగ అనే పేర్లతో పిలుస్తారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. వెలిగించిన దీపాలు స్వర్గానికి దారి చూపిస్తాయని విశ్వసిస్తారు. దీపావళి రోజు దీపాలు వెలిగిస్తే దేవతలు కరుణిస్తారని హిందువుల విశ్వాసం, అందుకే ప్రతి ఇంట్లో దీపాల వరుసలు కనిపిస్తూ శుభసంకేతాలు ప్రసరిస్తాయి.దీపావళిని కొన్ని ప్రాంతాల్లో మూడు, మరి కొన్ని ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్లటౌన్

గోగునార కట్టతో దిష్టితీత

దీపావళి సందర్భంగా 'దివ్వి దివ్వి దీపావళి ..' అంటూ పిల్లలు ఉత్సాహంగా పాటలు పాడుతుండగా పెద్దలు గోగునార కట్టలతో చేసిన దుందువాతో దిష్టి తీస్తారు. జడ్చర్ల మండలంలో చాలా గ్రామాల్లో ఈ సంప్రదాయం కొనసాగుతుంది. గురువారం ఈ వేడుక నిర్వహించనున్నారు. పొలాల్లో ఉన్న జీనుగ, పుంటికూర (గోగునార) కట్టెలు తీసుకువచ్చి వాటిని కట్టలా తయారు చేసి చిన్న చిన్న గుడ్డ పీలికలతో కాగడాలు కట్టి వెలిగించి దిష్టితీయటం ఆనవాయితీగా వస్తుంది. దీన్ని వాడుక భాషలో దుందువాగా వ్యవహరిస్తుంటారు. దిష్టి తీశాక పిల్లలు దక్షిణ దిశగా నిలబడి దీపం వెలిగించటం చేస్తారు.



దీన్ని ఉల్కాదానంగా పిలుస్తుంటారు. పితృదేవతలకు దక్షిణ దిక్కుగా దీపం వెలిగించటం వల్ల స్వర్గానికి వెళ్లేందుకు దారి చూపినట్లవుతుందని భావిస్తుంటారు. దీపం వెలిగించాక పిల్లలు కాళ్లు కడుక్కుని ఇంట్లోకి వచ్చి పూజాగృహంలో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించి దీపలక్ష్మికి నమస్కారం చేశారు. గురువారం రోజున సాధారణ నోములు, వ్రతాలు, లక్ష్మీపూజలు చేసుకునేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. అయితే కేదారేశ్వర వ్రతం ఆచరించే వారు శుక్రవారం జరుపుకోనున్నారు. గురువారమే చతుర్దశి కూడా ఉండడంతో ఉదయం భోగి మంగళహారతులు స్వీకరించి.. సాయంత్రం నోములు చేసుకోనున్నారు.

ప్రమిదలకు భలే గిరాకీ

- వివిధ డిజైన్లలో మట్టి దీపాలు
- జిల్లావ్యాప్తంగా ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు

దీపావళి పండుగలో ప్రమిదలు (మట్టి దీపాలకు) ప్రత్యేక స్థానం ఉంది. ఈ పండుగకు ఇంటిల్లిపాది దీపాలతో అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది. దీపావళి సందర్భంగా పట్టణాల్లో ప్రమిదల స్టాళ్లు వెలిశాయి. ప్రతి ఏడాది వివిధ డిజైన్లలో అందుబాటులోకి వస్తున్నాయి. జిల్లాకేంద్రంలోని ఏనుగొండ, పద్మావతీకాలనీ, మెట్టుగడ్డ, జనరల్ ఆస్పత్రి, జిల్లా పరిషత్ ఎదుట, మల్లికార్జున్ చౌరస్తా, అశోక్ టాకీస్ చౌరస్తా, క్లాక్‌టవర్, బస్టాండ్, పాన్‌చౌరస్తాలతోపాటు భూత్పూర్ చౌరస్తా, దేవరకద్ర, జడ్చర్లలోని సిగ్నల్‌గడ్డతో పాటు పలు ప్రాంతాల్లో ప్రమిదల స్టాళ్లు వెలిశాయి.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి...

కొంతమంది స్టాళ్ల నిర్వాహకులు కొన్ని ప్రమిదలను ఇక్కడే తయారు చేసి విక్రయిస్తున్నారు. వివిధ డిజైన్ల మట్టి దీపాలను తమిళనాడు, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు దిగుమతి అవుతుండగా అక్కడి నుంచి స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసి స్టాళ్లలో అందుబాటులో ఉంచుతున్నారు. ప్రమీదలను వాటి పరిణామం, డిజైన్‌ను బట్టీ విక్రయిస్తున్నారు. ముఖ్యంగా కందీల్ దీపాలు, గాజుతో చూసిన దీపాలు, ఐదు క్యాండిల్స్ దీపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చిన్నపాటి దీపాలు డజన్ రూ.40 నుంచి అమ్ముతుండగా ఇతర దీపాలు రూ.1500 వరకు కూడా లభిస్తున్నాయి. వాటర్‌ఫ్లవర్ రూ.150, ఎలక్ట్రిక్ ప్రమీద రూ.150 నుంచి 200 వరకు ఉంటోంది.







వివిధ రకాల ప్రమిదలు



జిల్లా కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి ప్రమిదలు

30 ఏళ్ల నుంచి వ్యాపారం...



జిల్లాకేంద్రంలో 30 ఏళ్ల నుంచి దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రమిదల స్టాల్‌ను పెడుతున్న. మూడు రోజుల నుంచి గిరాకీలు కొద్దిగా పెరిగాయి. అందరికీ అందుబాటులో ధరల్లో విక్రయిస్తున్నాం.

– రవికుమార్, స్టాల్ నిర్వాహకుడు, మహబూబ్‌నగర్

ఐదు రోజుల వేడుక.. మార్వాడీల ప్రత్యేకం



దీపాలను వెలిగిస్తున్న మార్వాడీ మహిళలు

రాజస్తాన్ మార్వాడీలకు దీపావళి ప్రత్యేకమని చెప్పవచ్చు. దాదాపు 100 ఏళ్ల క్రితమే పలు రాజస్తాన్‌కు చెందిన మార్వాడీల కుటుంబాలు పాలమూరులో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. పిల్లల చదువులు, వ్యాపారాల నిమిత్తం చాలా కుటుంబాలు హైదరాబాద్‌లో స్థిరపడ్డాయి. ప్రస్తుతం పట్టణంలో 150కిపైగా రాజస్తాన్ కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడే ఉంటున్నప్పటికీ రాజస్తాన్ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పండుగలు జరుపుకుంటారు. ముఖ్యంగా దీపావళిని ప్రతి కుటుంబం ఆనందోత్సవాల మధ్య ఐదు రోజుల పాటు నిర్వహించుకుంటారు. మొదటి రోజు ధన్‌తేరాస్‌ను నిర్వహిస్తారు. ఇంటిల్లిపాది లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేస్తారు. రెండో రోజు రూప్ చౌదాస్ వేడుకలు నిర్వహించుకుంటారు. గురువారం సాయంత్రం 6 గంటల తర్వాత లక్ష్మీదేవి పూజలు నిర్వహించి టపాసులు కాల్చి సంబరాలు జరుపుకుంటారు. ఉపవాసం ఉండి లక్ష్మీదేవికి పూజలు నిర్వహించి పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. నాలుగో రోజు గోవర్ధన్ పూజ (ఆవుపేడతో) నిర్వహిస్తారు. ఐదో రోజు బైదూజ్ వేడుకలు చేసుకుంటారు. వీరు గుంజ, బేసన్ చక్కి, పేటతోపాటు బెల్లంతో తయారుచేసిన తీపి వంటకాలు చేస్తారు.

సంప్రదాయాలు ఉట్టిపడేలా..



రాజస్తాన్ సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడేలా దీపావళిని జరుపుకుంటాం. మా తరతరాల ఆనవాయితీని కొనసాగిస్తున్నాం. దీపావళి పండుగ అనంతరం రాజస్తానీ కుటుంబాలు కలిసి లక్ష్మీనారాయణ భగవానుడికి పూజలు నిర్వహిస్తాం.

– సురేష్ చందర్ దూత్, మహబూబ్‌నగర్

పౌష్టికాహారంతో రక్తహీనతను నివారిద్దాం

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- జానంపేటలో ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ కేంద్రం ప్రారంభం
- ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచన



జానంపేటలో ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

అడ్డాకుల: మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తోందని.. రక్తహీనత నివారణకు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీఎంఆర్, ఎన్‌ఐఎన్ ద్వారా మూసాపేట మండలం జానంపేట పీహెచ్‌సీ పక్కన ఏర్పాటు చేసిన మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ (ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ)ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటగా జానంపేటలో ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. న్యూట్రీషియన్ చెప్పిన విధంగా అందరూ సరైన ఆహారం తీసుకుంటే ఆరోగ్య దేశంగా మారుతుందన్నారు. ఐసీఎంఆర్, ఎన్‌ఐఎన్ కృషి మూలంగానే కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ అందించిన ఘనత మన దేశం సొంతం చేసుకుందన్నారు. ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ కేంద్రం ఏర్పాటు చేయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త డా.భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ సమాజానికి పరిశోధన ఫలితాలను అందించడానికి, ఆరోగ్య పరిశోధన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎన్‌ఐఎన్ ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీఎంఆర్, ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్తలు డా.ఉదయ్‌కుమార్, డా. జీఎం సుబ్బారావు, డా. జేజే బాబు, డా. ఆర్లప్ప, డా. మహేశ్వర్, టెక్నికల్ ఆఫీసర్ హృషికేష్ పండ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ నేత కొండా ప్రశాంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో మొట్టమొదటి కేంద్రం..

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2013లో మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 2014 నుంచి దేశవ్యాప్తంగా 34 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తిరుపతికి సమీపంలోని చంద్రగిరిలో కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో మొదటి కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మాతాశిశు మరణాలు, రక్తహీనత, గుండె సంబంధిత సమస్యలను ఎక్కువగా గుర్తించగా.. వాటిపై ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ ద్వారా పరిశోధనలు చేపట్టనున్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో కేంద్రం పనిచేస్తుందని నోడల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. వచ్చే జనవరి నుంచి ఇక్కడ కార్యకలాపాలను కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే

- మండలస్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ
- కలెక్టర్ విజయేందిర



ఎంవీఎస్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో నవంబర్ 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ విజయేందిర అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ తరగతులను కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వేకు నియమించిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మండలస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 150 కుటుంబాలను ఒక్కో ఎన్యుమరేటర్ బ్లాక్‌గా విభజించామని.. 10 బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించినట్లు వివరించారు. 1నుంచి 3వ తేదీ వరకు ఎన్యుమరేటర్లు ఇళ్ల జాబితాను రూపొందించుకోవాలని సూచించారు. 6 నుంచి 18వ తేదీ లోగా సర్వేను పూర్తిచేయాలన్నారు. ఈ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. సర్వే విషయాలను గోప్యంగా ఉంచాలని తెలిపారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా సర్వే పక్కాగా ఉండాలన్నారు. సర్వే నిర్వహించే తీరు, మార్గదర్శకాలు తదితర అంశాలను సమగ్రంగా తెలుసుకోవాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. సర్వే అనంతరం డేటా ఎంట్రీ సైతం పక్కాగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు, ఎంపీడీఓ కరుణశ్రీ, ఎంపీఓ శంకర్‌నాయక్, రిసోర్స్‌పర్సన్ బాలు యాదవ్ పాల్గొన్నారు.

కొత్త కళాశాలల ఏర్పాటుతో కల సాకారమైంది



ఎమ్మెల్యే యెన్నం, వీసీ జీఎన్ శ్రీనివాస్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కొత్త కళాశాలల ఏర్పాటుతో ఎన్నో రోజులు పాలమూరు విద్యార్థులు ఎదురుచూస్తున్న కల సాకారమైందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పీయూలో ప్రభుత్వం లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు చేసిన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం తెలిపి టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందిని కూడా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు, ముఖ్యమంత్రి, రాష్ట్ర అధికారులతో పాటు తమందరి కృషి వల్ల యూనివర్సిటీకి రూ.100 కోట్లు తీసుకురావడం సాధ్యమైందన్నారు. 2012లో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో నిధులు లేకుండా కొట్టుమిట్టాడుతున్న యూనివర్సిటీకి అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని తీసుకువచ్చి రూ.18 కోట్లు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. ఇక్కడికి వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను రప్పించి కార్యక్రమం నిర్వహించడంలో మంచి ఉద్దేశం ఉందని, ఇక్కడికి వచ్చిన విద్యార్థులలో కనీసం పదిశాతం మంది అయినా ఇక్కడ సీటు సాధించి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి తన చదువులు పూర్తయ్యేలోగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో పాటు స్టార్టప్‌లు ప్రారంభించేందుకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, వినోద్ పాల్గొన్నారు.

- వీసీ జీఎన్ శ్రీనివాస్ మట్లాడుతూ పీయూలో ఇంజినీరింగ్ లా, కళాశాలలు ప్రారంభించేందుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంజూరైన కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు తదితరులు

పత్తి క్వింటా రూ.6,499

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాల్ గరిష్టంగా రూ.6,499, కనిష్టంగా 6,179లభించాయి. మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,519, కనిష్టంగా రూ.1,449, ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ గరిష్టంగా రూ.2,121, కనిష్టంగా రూ.2,061 ధరలు లభించాయి.

క్లుప్తంగా

వ్యక్తి హఠాన్మరణం


తోట కుమార్ (ఫైల్)

బిజినేపల్లి: మండల కేంద్రంలో ఓ వ్యక్తి బుధవారం దుకాణం వద్దే కుప్పకూలి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన తోట కుమార్ (46) మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తుండేవాడు. బుధవారం తన కుమార్తెను అమ్మమ్మ ఇంటికి పంపించేందుకు బైక్‌పై బిజినేపల్లికి తీసుకొచ్చాడు. బస్సు ఎక్కించిన తర్వాత దుకాణం వద్దకు చేరుకున్నాక గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్‌కు భార్య కావేరి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల ప్రకారం.. మండలంలోని నాగినోనిపల్లి గ్రామానికి చెందిన తుప్పలి చెన్నయ్య(26) ఈనెల 26న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఈ క్రమంలో హన్వాడ శివారులోని బాలాజీ కొండ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఆయన్ని ఢీకొట్టింది. దీంతో తలకు, చేతులకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. ఆయన అన్న గంగపురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో యువకుడికి రిమాండ్

గద్వాల క్రైం: బాలికను లైంగిక వేధింపులకు గురి చేసిన సంఘటనలో యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. జిల్లాకు చెందిన బాలికను గద్వాలకు చెందిన తరుణ్ లైంగిక వేధింపులకు గురి చేశాడు. ఈ సంఘటనపై తల్లిదండ్రులు ఈ నెల 26న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్సో కేసు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం యువకుడిని అదుపులోకి తీసుకొని, గద్వాల కోర్టులో హాజరుపరిచారు. దీంతో న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు జైలుశిక్ష విధించాడు. మైనర్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మహమ్మదాబాద్: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఆముదాలగడ్డ తండా గాధిర్యాల్ మధ్యలో బుధవారం సాయంత్రం రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తీసుకొస్తుండగా, పోలీసులను గమనించిన ఇసుక వ్యాపారులు అన్‌లోడ్ చేసి పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా, ఇసుక తరలిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆలయాలకు 'కార్తీక' వెలుగులు

- శైవ, వైష్ణవ మందిరాల్లో రోజు సాయంత్రం సామూహిక దీపారాధన
- ప్రతి సోమవారం, పౌర్ణమి రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ
- ఆదేశాలు జారీచేసిన దేవాదాయశాఖ

జోగుళాంబ శక్తిపీఠం: ఉమ్మడి జిల్లాలోని శైవ, వైష్ణవ ఆలయాలు కార్తీక శోభను సంతరించుకోవాలని.. రోజు సాయంత్రం వేళ దీపాలు వెలిగించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ప్రధానకార్యదర్శి శైలజ రామయ్యార్, కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గద్వాల జిల్లాలోని అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి, బీచుపల్లి ఆంజనేయస్వామి, మల్దకల్, పాగుంట వేంకటేశ్వరస్వామి ఆలయం, వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి, జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, బుద్దారం గండి ఆంజనేయస్వామి దేవాలయాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉమామహేశ్వరం, మద్దిమడుగు, సిర్సనగండ్ల సీతారామాంజనేయస్వామి ఆలయాలు, మహబూబ్‌నగర్‌లోని కురుమూర్తిస్వామి, మన్యంకొండ వేంకటేశ్వరస్వామి, న్యూగంజ్ నరసింహస్వామి, చిన్నరాజమూరు ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించడంతో పాటు పలు కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.


అలంపూర్‌లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు (ఫైల్)

ప్రత్యేక కార్యక్రమాలు..

రోజు సాయంత్రం 6 నుంచి ఆలయాల్లో భక్తులతో సామూహికంగా దీపాలు వెలిగించాలి. ప్రతి సోమవారం కళాకారులతో కూచిపూడి, భరతనాట్యం లేదా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి. కార్తీక పౌర్ణమి రోజు కృతికోత్సవం పేరిట జ్వాలాతోరణం, ఏకాదశి రోజు లలిత సహస్రనామ పారాయణం, తులసి ద్వాదశిరోజు తులసి బృందావనానికి పూజలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


కార్తీక మాసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ పురందర్‌కుమార్

ఆలయాలు దేదీప్యమానం కావాలి..



కార్తీక మాసం అంటేనే దీపోత్సవం. ప్రతి భక్తుడు కుటుంబంతో కలిసి ఆలయాల్లో దీపాలు వెలిగిస్తారు. ఈ మాసంలో భక్తులు ఆలయాలను అధికసంఖ్యలో దర్శించుకుంటారు. ఈ ఏడాది అన్ని ఆలయాల్లో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శైలజ రామయ్యార్, దేవాదాయశాఖ ప్రధానకార్యదర్శి

అన్ని ఆలయాల్లో అమలు..



కార్తీక మాసం విశిష్టతను చాటేలా, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా అన్ని ఆలయాల్లో ప్రతిరోజు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. అన్ని ఆలయాల నిర్వాహకులు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకుంటాం.

– మంత్రిప్రగడ హనుమంతరావు, కమిషనర్, దేవాదాయశాఖ

ఘనంగా నిర్వహిస్తాం..



దేవాదాయశాఖ ఆదేశాల మేరకు అలంపూర్ ఆలయాల్లో కార్తీకమాసం ప్రత్యేక కార్యక్రమాలు విధిగా నిర్వహిస్తాం. ఆలయ ప్రాంగణంలో ఓం, శ్రీ, స్వస్తిక్, త్రిశూలం ఆకృతులు తయారు చేయించి అందులో భక్తులు దీపాలు వెలిగించేలా చూస్తాం. ఆలయాలకు కార్తీక శోభ తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తాం. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– పురేందర్ కుమార్, ఈఓ, అలంపూర్ ఆలయాలు

మంచి నిర్ణయం..



ఈ ఏడాది దేవాదాయశాఖ మంచి నిర్ణయం తీసుకుంది. అన్ని ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ.. ప్రత్యేకంగా కార్తీక దీపాలు వెలిగించాలని నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాం. అన్ని ఆలయాల్లో ఉచితంగా నిర్వహించే కార్తీక దీపోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనేలా మా వంతు ప్రచారం చేస్తాం.

– నాగశిరోమణి, సభ్యురాలు, జోగుళాంబ పాలక మండలి

నర్సింగ్ కళాశాల యువతి అదృశ్యం

మహమ్మదాబాద్: నర్సింగ్ కళాశాలకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. గండేడ్ మండల పరిధిలోని చెన్నాయపల్లికి చెందిన శీలం చెన్నయ్య కూతురు శీలం శైలజ హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో నర్సింగ్ చదువుతోంది. ఇదే క్రమంలో ఈనెల 28న ఉదయం కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. తిరిగి యువతి రాకపోవడం, ఆమె ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ కావడంతో కాలేజీకి ఫోన్ చేయగా రాలేదని చెప్పారు. చెన్నాయపల్లికి చెందిన సుదర్శన్‌పై అనుమానం ఉందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,0 కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

11 టపాసుల దుకాణాలపై కేసులు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణాసంచా దుకాణాల్లో బుధవారం లీగల్ మెట్రాలజీ అధికారి రవీందర్ తనిఖీలు నిర్వహించారు. పలు రకాల టపాకాయల ప్యాకేజీలపై ధరలను పరిశీలించారు. వస్తువుల తయారీ, గరిష్టం అమ్మకం ధరలు ఉన్న క్రమంలో 11 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వ్యాపారులు టపాకాయలు అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో పాటు పట్టణంలో పలు రకాల స్వీట్‌హౌజ్‌లలో తనిఖీలు చేసి నిబంధనలు పాటించని మూడు స్వీట్‌హౌజ్‌లపై కేసులు నమోదు చేశారు. ప్యాకేజీ స్వీట్‌బాక్స్‌లపై వినియోగదారుల రక్షణ కోసం తయారీ తేదీలతో పాటు ఎమ్మార్పీ కచ్చితంగా ఉండాలన్నారు.

ఖోఖో చాంపియన్ ఆదిలాబాద్



బాలబాలికల విభాగంలో గెలుపొందిన ఆదిలాబాద్ జట్లకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం తదితరులు

- రెండు విభాగాల్లోనూ సత్తాచాటిన జట్లు
- బాలుర విభాగంలో రన్నరప్ రంగారెడ్డి
- బాలికల్లో రన్నరప్ నల్లగొండ
- ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరుగుతున్న 43వ రాష్ట్ర స్థాయి అంతర్‌జిల్లా జూనియర్ ఖోఖో పోటీలు బుధవారం ముగిశాయి. టోర్నీలో బాలుర, బాలికల విభాగాల్లో ఆదిలాబాద్ జట్లు చాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నాయి. బాలుర విభాగం రన్నరప్‌గా రంగారెడ్డి, బాలికల రన్నరప్‌గా నల్లగొండ జట్లు నిలిచాయి. బాలుర విభాగం మూడు, నాల్గు స్థానాల్లో వరంగల్, మెదక్, బాలికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జట్లు నిలిచాయి.

ఉత్కంఠంగా బాలుర ఫైనల్

ఆదిలాబాద్–రంగారెడ్డి బాలుర జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. చివరి వరకు మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టు 38–36 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై విజయం సాధించింది. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టు 20–16 పాయింట్ల తేడాతో నల్లగొండపై గెలుపొందింది.

రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ క్రీడలు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ క్రీడోత్సవాలు జరగనున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రానున్న సీఎం కప్ కోసం ఉత్తమ శిక్షణ ఇప్పించాలని కోరారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మహబూబ్‌నగర్ ఖోఖో అసోసియేషన్ ఈ పోటీలను నిర్వహించిందని, వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. సీఎం కప్ మంచి అవకాశమని, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ త్వరలో ఏర్పాటు కానుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే విన్నర్, రన్నర్, మూడు, నాల్గుస్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, రాష్ట్ర ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జీపీ విలియం, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. బాల్‌రాజు, టీజీపెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పాపారాయుడు, మధుకుమార్, కౌన్సిలర్లు మోతీలాల్, నర్సింహులు, రిటైర్డ్ పీడీ యా. శ్రీనివాసులు, సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

రాజశేఖర్‌రెడ్డి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం

- బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడి సోదరుడిని విచారించిన పోలీసులు
- త్వరలో పట్టుకుంటాం: డీఎస్పీ సత్యనారాయణ వెల్లడి

గద్వాల క్రైం: మల్దకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలిక (16) ఆత్మహత్యకు కారణమైన బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. బాలికతో వెట్టి చాకిరీ చేయించుకోవడంతో పాటు దొంగతనం నింద మోపడం.. పోలీసులు విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించడంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. అయితే బాలిక ఆత్మహత్యకు గద్వాలకు చెందిన బండ్ల రాజశేఖర్‌రెడ్డి కారణమయ్యాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు వ్యవహారంలో నిందితుడు వారం రోజుల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో బుధవారం డీఎస్పీ సత్యనారాయణతో పాటు మరికొందరు పోలీసులు నిందితుడు సోదరుడైన బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో దాదాపు రెండు గంటలపాటు అతడిని విచారించారు. బండ్ల రాజశేఖర్‌రెడ్డిని త్వరలోనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.

పలు విషయాలపై ఆరా..

నిందితుడు బండ్ల రాజశేఖర్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డిని పోలీసులు విచారణ సమయంలో పలు విషయాలపై ఆరా తీసినట్లు తెలిసింది. బాలిక ఎప్పటి నుంచి తన సహోదరుడి ఇంట్లో పనిచేస్తుంది.. ఇంట్లో ఎలాంటి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లింది.. దొంగతనం జరిగిన క్రమంలో చూసిన కుటుంబ సభ్యులెవరు.. మల్దకల్ పోలీసులకు ఎప్పుడు ఫిర్యాదు చేశారు.. రాజశేఖర్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లినప్పటి నుంచి ఫోన్ సంభాషణ.. ఎక్కడ ఉన్నాడనే విషయాలపై విచారించినట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారని.. అతడు ఎక్కడ ఉన్నాడని విషయంపై ప్రశ్నించినట్లు తెలిసింది. సోదరుడి ఇంట్లో జరిగిన అంశాలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులతో చెప్పినట్లు సమాచారం.

పోలీసుల తీరుపై విమర్శలు..

బాలిక మృతికి కారకుడైన సీడ్ పత్తి వ్యాపారికి వివిధ పార్టీల నాయకులతో స్నేహబంధం ఉండటం.. వారు ఉన్నతాధికారులను సమన్వయం చేసే వ్యక్తులుగా ఉండటంతో పోలీసులు నిందితుడిని పట్టుకోవడంలో హైడ్రామా ఆడుతున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. బాలికకు చికిత్స సమయంలో ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందుతుందనే విషయం తెలుసుకుని, అదే రోజు నిందితుడు తప్పించుకోవడం వెనుక ఉన్న అంతర్గత రహస్యాన్ని పోలీసులు ఇప్పటి వరకు గుర్తించలేకపోవడంపై వివిధ సంఘాల నాయకులు జిల్లా పోలీసు శాఖపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ వ్యక్తులపై కేసులు నమోదైన క్రమంలో పోలీసులు చూపే ఉత్సాహం.. ఈ కేసు వ్యవహారంలో ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. మరోవైపు బాలిక కుటుంబ సభ్యులను ఇటీవల గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరామర్శించారు. గురువారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సైతం వస్తుండటంతో పోలీసులు నిందితుడి సోదరుడిని విచారించామనే అంశాన్ని తెరపైకి తీసుకువచ్చినట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి.

జూరాలకు నిలకడగా వరద



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు 23 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. బుధవారం సాయంత్రం వరకు అదేస్థాయిలో కొనసాగుతున్నట్లు వివరించారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలోని మూడు యూనిట్ల నుంచి ఉత్పత్తి చేపట్టామని.. ఇందుకోసం 18,466 క్యూసెక్కుల నీటిని వినియోగించామన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 730, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.418 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

2 గేట్లు ఎత్తి నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో రెండు గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 11,850 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. గేట్ల ద్వారా 8,892 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలంలో నీటిమట్టం 882.1 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం నీటిమట్టం 882.1 అడుగుల వద్ద 199.7354 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 22,330 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 8,892 మొత్తం 31,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలంలో ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,600 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 7,069 మొత్తం 43,669 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 27,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,533, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,533 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

యువకుడి అవయవదానం


శ్రీను (ఫైల్)

మక్తల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడికి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబసభ్యులు అతడి అవయవాలను జీవన్‌దాన్ సంస్థకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. మక్తల్ మండలం అంకెన్‌పల్లికి చెందిన శ్రీను (36) వ్యక్తిగత పని నిమిత్తం ఐదురోజుల కిందట నారాయణపేటకు వెళ్లారు. తిరిగి అదేరోజు స్వగ్రామానికి వస్తుండగా తిప్రాస్‌పల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం అతడి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవాలను జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. ఆస్పత్రి సిబ్బంది గౌరవ వందనం తెలిపి నివాళి అర్పించారు.

ఆర్టీసీ బస్సులో రూ. 3.69 లక్షలు చోరీ

జడ్చర్ల: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి బ్యాగు నుంచి నగదు చోరీ జరిగిన ఘటన జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి వివరాల మేరకు.. తిమ్మాజిపేటలో ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికురాలు పావని జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో దిగింది. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. మాచారం గ్రామ సమీపంలో తన బ్యాగును సరిచూసుకోగా.. అందులో దాచి ఉంచిన రూ. 3,69,500 నగదు కనిపించలేదు. వెంటనే జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బుద్దారం గండి చెక్‌డ్యాంలో యువకుడి గల్లంతు



గోపాల్‌పేట: బుద్దారం గండి చెక్‌డ్యాంలో పడి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఎస్‌ఐ నరేశ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని చెన్నూరుకు చెందిన శ్రీను వెల్డర్‌గా, విష్ణు (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవారు. బుధవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి బుద్దారం గండి సమీపంలో మద్యం తాగారు. అనంతరం ఈత కొట్టేందుకు చెక్‌డ్యాంలో దూకారు. శ్రీను బయటకు రాగా.. విష్ణు బయటకు రాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టారు.

కీచక ఉపాధ్యాయుడు

- డిగ్రీ విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన
- అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు


మాస్కు ధరించిన ఉపాధ్యాయుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

అచ్చంపేట రూరల్: విద్యార్థులకు దిశానిర్దేశం చేయాల్సిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వృత్తికే మాయని మచ్చలా ప్రవర్తించాడు. విద్యాబుద్ధులు నేర్పించి, సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు కీచకుడిలా వ్యవహరించాడు. ఎస్‌ఐ రమేష్ వివరాల మేరకు.. అచ్చంపేట పట్టణానికి చెందిన డిగ్రీ విద్యార్థిని ఇంటి వెనకాల నివసిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సిద్దార్థ మహాదేవ్ ఆదివారం విద్యార్థిని ఇంట్లోకి వెళ్లాడు. తన వెంట తీసుకెళ్లిన సెల్‌ఫోన్ విద్యార్థినికి ఇవ్వబోయి.. తనతో మాట్లాడాలని, అసభ్యంగా ప్రవర్తించాడు. సెల్‌ఫోన్‌ను తిరస్కరించిన విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సదరు ఉపాధ్యాయుడు అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని ఓ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

- నగలు, ల్యాప్‌ట్యాప్ స్వాధీనం


నిందితుడితో సీఐ ఆదిరెడ్డి, తదితరులు

జడ్చర్ల: జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో ఇటీవల రెండు సార్లు దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23న పెబ్బేర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బాను ప్రకాశ్ ల్యాప్‌ట్యాప్ బ్యాగును జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో బస్సు ఆగిన సమయంలో చోరీ చేశారు. 28న జనగామ జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌కు చెందిన కాసం ఉపేంద్ర భర్త ఆంజనేయులుతో కలిసి కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు తెలంగాణ ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భోజనం కోసం జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో బస్సు నిలిపారు. ఆ సమయంలో తమ బ్యాగును సీటుపై పెట్టి హోటల్‌కు వెళ్లారు. తర్వాత బస్సులో సీటుపై బ్యాగు కనిపించలేదు. బ్యాగులో 9 తులాల బంగారు నగలు ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు సీఐ తెలిపారు. బుధవారం జాతీయ రహదారి ఫ్లెఓవర్ బ్రిడ్జి దగ్గర నిందితుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి నుంచి ల్యాప్‌ట్యాప్‌తో పాటు 9తులాల నగలు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్‌ఐ శివానందం, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పీయూకు లా, ఇంజినీరింగ్ కళాశాలలు తీసుకొచ్చినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, భరత్, నందు, రమేష్, బన్నీ, మధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ

నవాబుపేట: మండలంలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన సొంత నిధులతో జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వం పాఠశాల, కళాశాల విద్యార్థులకు షూస్‌ను అందిస్తున్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, రవీందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, బీరయ్య ఉన్నారు.

చదువుపై శ్రద్ధ వహించాలి



మహమ్మదాబాద్: బాలికలు మానసిక, శారీరక వత్తిళ్లకు గురికాకుండా సమస్యలను అధిగమిస్తూ చదువుపై శ్రద్ధ వహించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సభ్యురాలు అరుణ తెలిపారు. 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాలో బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ, చదువులో తమ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మి, గీత, మంజుల, రశ్మిత, తదితరులు పాల్గొన్నారు.

1న జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ –14 బాల బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటాజి, పీడీ మొగులాల్ తెలిపారు. పోటీల్లో ఐదు జిల్లాల నుంచి 150 మంది బాలబాలికలు ఖోఖో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

గెలుపు కోసం పని చేయాలి

పాలమూరు: రాబోయో ఎన్నికల్లో గెలుపు సాధించాలంటే కార్యకర్తల సంఖ్య పెరగాల్సి ఉందని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ సభ్యత్వాలు పెరిగితే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపు సాధ్యమ వుతుందన్నారు. బాధ్యతగా ప్రతి కార్యకర్త లక్ష్యం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బీజేపీ శ్రీనివాస్‌రెడ్డి, పడాకుల బాలరాజు, రవీందర్‌రెడ్డి, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు పంపిణీ

దేవరకద్ర: మండలం నార్లోనికుంట్లలో ఇటీవల అనారోగ్యంతో మహిళా రైతు రాధమ్మ మృతి చెందడంతో రైతుబీమా ద్వారా వచ్చిన రూ.5 లక్షల చెక్కును బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షులు గోపాల్, గోవర్ధన్,ఉన్నారు.

బీసీలపై కక్ష సాధింపు తగదు



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్‌లో బీసీలపై జరుగుతున్న కక్ష సాధింపు చర్యలు ఆపాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన విధంగా ఈ ప్రభుత్వంలో కూడా సామాజిక మాధ్యమాల్లో విమర్శిస్తే తట్టుకోలేని పరిస్థితుల్లో నాయకులు ఉన్నారా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అంటేనే ప్రశ్నించడమని, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నాడనే నెపంతో నిన్న పాలమూరులో ఓ బీసీ నాయకుడిని పోలీసులు బైండోవర్ చేసి ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో బీసీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తే బీసీ సమాజ్ చూస్తూ ఊరుకోదని తెలిపారు. ఎక్కడ బీసీలకు అన్యాయం జరిగిన బీసీ సమాజ్ ప్రశ్నిస్తుందని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

రాజాపూర్: రైలు కిందపడి వ్యక్తి రెండుకాళ్లు పోగొట్టుకున్న సంఘటన బుధవారం రాత్రి రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కొల్లాపూర్ గ్రామానికి చెందిన రాములు కొన్ని నెలల క్రితం రంగారెడ్డిగూడకు భార్య పిల్లలతో వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి రాములు రైల్వేగేట్ దాటుతున్న సమయంలో బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్‌రైల్ వేగంగా ఢీకొట్టింది. దీంతో రాములు రెండు కాళ్లు తెగిపోయాయి. వెంటనే అక్కడున్న ఆర్‌ఎంపీ ఆనంద్ గమనించి ప్రథమచికిత్స నిర్వహించి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థుల్లో క్రీడానైపుణ్యం వెలికితీయొచ్చు

- ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో బుధవారం 3వ జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ టీ–10 క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా క్రీడాపతాకాన్ని ఎగురవేసి పాఠశాల క్రీడాజట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి టోర్నీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, లిటిల్ స్కాలర్స్ స్కూల్ డైరెక్టర్ సుషమ్మారాయ్, సలహాదారులు రవిచందర్, ప్రిన్సిపల్ వేణుగోపాల్, రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ రిటైర్డ్ క్రీడాధికారి రమేశ్‌కుమార్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, సోహైల్ ఉర్ రహెమాన్, పాపారాయుడు, నర్సింహులు, పీడీ బాల్‌రాజు, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్, నాసర్, బాలు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుషమ్మారాయ్ తదితరులు

మొదటి రోజు ఫలితాలు

టీ–10 టోర్నమెంట్‌లో 26 పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. తొలి రోజు మ్యాచుల్లో అపెక్స్ స్కూల్ జట్టు 35 పరుగుల తేడాతో భాష్యం స్కూల్ జట్టుపై, డీవైస్ హై స్కూల్ జట్టు 9 పరుగుల తేడాతో దక్ష హై స్కూల్ జట్టుపై గెలుపొందాయి.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

- ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి



లింగంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

నవాబుపేట/రాజాపూర్: ఉపాధ్యావృత్తి చాలా పవిత్రమైందని, ఆ వృత్తిలో కొనసాగటం పూర్వ జన్మ సుకృతమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లింగంపల్లి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ధ్యాప వెంకట్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ విధినిర్వహణలో చాలా మంది ఉన్నత వ్యక్తులను తయారు చేసి దేశానికి అందించే మహనీయులన్నారు. అలాంటి వృత్తి చాలా పవిత్రంగా ధర్మంగా బావించాలన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, లక్ష్మమ్మ, పద్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, శాంసుందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి ఉన్నారు.

హామీలు గాలికొదిలేసిన ప్రభుత్వం..

ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని హామీలిచ్చి నేడు గాలికొదిలేస్తోందని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. రాజాపూర్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారికి వచ్చే జీతాలతోనే కుటుంబ పోషణ కొనసాగిస్తారని, అలాంటిది వారికి వచ్చే బెనిఫిట్స్ సకాలంలో ఇవ్వకుండా నాన్చుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను, జీపీఎఫ్ అమౌంట్ మరియు మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఉపాధ్యాయులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షులు సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఒత్తిడితోనే విద్యుత్‌చార్జీల పెంపురద్దు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ డిస్కాంల ప్రతిపాదనల మేరకు విద్యుత్‌చార్జీలు పెంచేందుకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ పార్టీ ఒత్తిడితోనే ఆ ప్రతిపాదనను విరమించుకుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవడంతో బుధవారం న్యూటౌన్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయం ముందు బాణా సంచా కాల్చి సంతోషంగా వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రతిపాదన తీసుకొస్తే దాన్ని ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చామన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఇష్టం వచ్చిన హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, శివరాజ్, దేవేందర్ రెడ్డి, కరుణాకర్ గౌడ్, కొండా లక్ష్మయ్య, ఆంజనేయులు, అహ్మదుద్దీన్, రామకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు..

జడ్చర్ల టౌన్: విద్యుత్ చార్జీల భారం లేకుండా తమ అధినేత కేటీఆర్, మాజీ మంత్రులు కృషి చేశారని జడ్చర్లలో సిగ్నల్‌గడ్డపై బీఆర్‌ఎస్ నాయకులు బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, పి.మురళి, రఘుపతిరెడ్డి, నాగిరెడ్డి, బాలు, తదితరులు ఉన్నారు.

బోరు మోటార్ల చోరీ

నవాబుపేట: మండలంలోని కోళ్ళగుట్టతండాలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన చందునాయక్ పొలంలో రెండు బోరు మోటార్లు చోరీ చేశారు. వేరుశనగ పంటల కోసం ప్రత్యేక గోతులలో ఉంచిన మోటార్లను దొంగలు వైరుతో పాటు అపహరించారు. ఈ విషయంపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

వరుస చోరీలు..

మండలంలో పదిహేను రోజుల వ్యవధిలో లోకిరేవు, లింగంపల్లి, రేకుల చౌడాపూర్ గ్రామాల రైతుల మోటార్లు, వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్టాటర్ డబ్బాలు సైతం చోరీ చేయటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వరుస చోరీలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

శిలాఫలకంపై మండలం మార్పు!



అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట వద్ద మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చి కేంద్రాన్ని బుధవారం ఎంపీ డీకే అరుణ ప్రారంభించగా, అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మండలం పేరును నిర్వాహకులు తప్పుగా రాయించారు. మూసాపేట మండలం బదులు భూత్పూర్ మండలంగా రాయించారు. ప్రారంభోత్సవం సమయంలో శాస్త్రవేత్తలు జానంపేట ఏ మండలానికి వస్తుందని ఆరాతీశారు. భూత్పూర్ మండలం కాదు, మూసాపేట మండలమని స్థానికులు చెప్పడంతో నిర్వాహకులు పొరపాటు చేసినట్లు గుర్తించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిర



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిర

జడ్చర్ల టౌన్: బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఇందిర పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చిట్టెబోయిన్‌పల్లి టీఎస్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల, పాఠశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌కు ఆమె హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పాన్ ఇండియా రెస్క్యూ, రిహబిలిటేషన్ ప్రోగ్రాం క్యాంపెయిన్‌లో భాగంగా సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు చదువులపై శ్రద్ధపెట్టి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, న్యాయవాదులు మాలిక్‌షాకీర్, పురుషోత్తం రావు, కళాశాల ప్రిన్సిపల్ భవాని పాల్గొన్నారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే



భూత్పూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్



మహమ్మదాబాద్‌లో..

దేవరకద్ర/భూత్పూర్/హన్వాడ/నవాబ్‌పేట/మహమ్మదాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపాలిటీ, మండలంలోని ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్లకు సమావేశం నిర్వహించారు. నవంబర్ 1 నుంచి 3 వరకు ఒక్కో ఎన్యూమరేటర్ 150 ఇళ్లు మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాలు కేటాయించినట్లు తెలిపారు. నవంబర్ 6 నుంచి 18 వరకు ఇంటింటికి వెళ్లి కుటుంబ యజమాని పేరు, ఇంట్లో ఉంటున్న కుటుంబ సభ్యుల వివరాలు, కుటుంబం ఆర్థిక, సామాజిక, ఉపాధి, విద్య, రాజకీయ నేపథ్యం, కులం, మతం తదితర వివరాలు ఫాంలో నింపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహమాన్ ఎంపీఓ శ్రీదేవి, ఏఓ మురళీధర్, పీఆర్ ఏఈ స్వామి, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

- హన్వాడలో మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఓ యాదయ్య మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యుమరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్టునాయక్, ఎంపీడీఓ యశోదమ్మ, ఎంపీఓ కృష్ణాజీరావు, అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.
- నవాబుపేటలో మండల స్పెషల్ అధికారి శంకరాచారి మండల కేంద్రంలో సామాజిక సర్వేపై అధికారులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఏఓ కృష్ణకిషోర్, బద్రునాయక్, ఏపీఓ జ్యోతి, ఏపీఎం జీవరత్నం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.
- మహమ్మదాబాద్‌లో మండల ప్రత్యేకాధికారి ఛత్రునాయక్ సమగ్రసర్వేపై గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీబీకేలు, ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, డీటీ శేఖర్ ఉన్నారు.
- దేవరకద్ర మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో సామాజిక సర్వేపై ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ దీపిక, ఏఓ రాజేందర్ అగర్వాల్, ఎంఈఓ బలరాం శిక్షణ ఇచ్చారు.

వేములలో వ్యవసాయ విజ్ఞాన సదస్సు



వేములలో విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న రైతులు

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల రైతు వేదికలో బుధవారం వ్యవసాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఏరువాక కేంద్రం మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదర్బంగా డాట్ కోఆర్డినేటర్ సీహెచ్.భరత్‌భూషణ్, శాస్త్రవేత్తలు శ్రీధర్, అర్చన, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అర్చన, ఎంఏఓ అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. విజ్ఞాన ప్రదర్శనలో అధిక దిగుబడి రావడానికి రైతులు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. సమీకృత వ్యవసాయం, వరి సాగులో డ్రమ్ సీడర్, పత్తిలో అధిక సాంద్రత, పత్తిసాగు, అంతర పంటలు, పాలీహౌస్, వర్మీకంపోస్ట్, స్ప్రిరులినా వ్యవసాయం, సుస్థిర వ్యవసాయం, బయోగ్యాస్ ప్లాంట్‌పై విజ్ఞాన ప్రదర్శన ద్వారా రైతులకు చూపించారు.

ఆలయ కమిటీ ఎంపిక



నూతన కమిటీని సత్కరిస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని శివ మారుతి రామాలయ దేవస్థానం నూతన కమిటీ అధ్యక్షుడిగా వన్నం ఆంజనేయులును, నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా భాస్కర్‌గౌడ్, శెట్టిశేఖర్, గిన్నె రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా జి.ఆంజనేయులు, కోశాధికారిగా యాదయ్యశెట్టి, ఉపాధ్యక్షులుగా ఎన్‌టీగౌడ్, నర్సింహసాగర్, ఉండెకోడ్ కృష్ణ, జి.సతీష్‌సాగర్, సీజీ. మధు, వీ.రాజు, శ్రీనివాస్‌శర్మ, ఎంపిక చేశారు. అనంతరం నూ తన కమిటీని శాలువాలతో సత్కరించారు.

రామయంత్ర రథయాత్రకు నీరాజనం



జడ్చర్ల: అయోధ్యలోని రామాలయంలో ప్రతిష్ఠించనున్న రామయంత్ర రథయాత్రకు బుధవారం జడ్చర్లలో భక్తులు ఘన స్వాగతం పలికి స్వామి వారిని దర్శించుకున్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో శ్రీరామాలయం వద్దకు చేరిన రథానికి భక్తులు స్వాగతం పలికారు. అక్కడి నుండి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు రథం చేరుకోగానే మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు జగ్‌పాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అఖిల్‌రెడ్డి, రంజిత్‌బాబు, లావణ్య, పద్మలీల,విశ్వనాథం పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో దీపావళి సంబరాలు



న్యూరిషీలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



శ్రీ చైతన్యలో దీపావళి సంబరాల్లో విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో బుధవారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం విభాగం ఏకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బంకమట్టి, గోదుమపిండి, నారింజ, నిమ్మ, ప్యాషన్ ఫ్రూట్ ఉసిరి ఫలాలతో ప్రమిదలను తయారు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు వాటి ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అమీనాముంతాజ్, మధుసూదన్, శ్రీదేవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలోని న్యూరిషీ పాఠశాలలో బొమ్మల కొలువు ఏర్పాటు చేయడంతో పాటు సీతారాముల వేషధారణలో విద్యార్థుల కళారూపాలు ఆకట్టుకున్నాయి. దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడంపై విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్లకార్డుల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్లు సాయిసుశాంత్ కృష్ణ, పూజితామోహన్‌రెడ్డి, శిరీషా ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్ బ్రాంచ్‌లో దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆయా పాత్రల వేషధారణతో ప్రదర్శన చేయించారు. అనంతరం పటాకులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర ఇవ్వాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: పత్తి పంటకు, వరికి మద్దతు ధర, బోనస్‌లు ఇచ్చి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టీ.సాగర్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి దోపిడీని అరికట్టి, కనీస మద్దతు ధరలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.470లు అదనంగా ఇవ్వాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు మాట్లాడుతూ సీపీఎం జిల్లా మహాసభలు నవంబర్ 8, 9 తేదీల్లో జడ్చర్ల పట్టణంలో జరుగనున్నాయని, ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి, బి.చంద్రకాంత్, పద్మ పాల్గొన్నారు.

సిగ్నల్‌గడ్డ రోడ్డు పనులు వేగవంతం చేస్తాం



పనుల ఆలస్యంపై వివరిస్తున్న కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి

జడ్చర్ల: సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రోడ్డు విస్తరణ పనుల జాప్యాన్ని సమీక్షించేందుకు స్థానిక మాజీ జెడ్పీటీసీ సభ్యులు శివకుమార్ ఆధ్వర్యంలో పలువురు కాంట్రాక్టర్‌ను సిగ్నల్‌గడ్డ వద్దకు ఆహ్వానించారు. రైల్వేబ్రిడ్జి దగ్గర రైల్వే విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్తంభాలను పక్కకు జరిపేందుకు అనుమతి లభించకపోవడంతో పనుల్లో ఆలస్యం జరిగిందని కాంట్రాక్టర్ తెలిపారు. డిశంబర్‌లోగా రైల్వే శాఖ నుంచి అనుమతి లభించే అవకాశాలు ఉన్నాయని, అ ను మతి వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఒక వైపు సింగిల్ లైన్ ను ఫిబ్రవరిలోగా పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఏఈ రవి, డాక్టర్ రాంరెడ్డి, పెంటయ్య, ఆనంద్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జున్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ని యంత్రణ మండలి (ఈఆ ర్సీ) చైర్మన్‌గా జస్టిస్ దేవ రాజు నాగార్జున్ బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ నియంత్రణ్ భవన్‌లోని ఈ ఆర్సీ కార్యాలయంలో ఆయనతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రమాణస్వీ కారం చేయించారు. ఈ సం దర్భంగా జస్టిస్ దేవరాజు నాగార్జున్ మాట్లాడుతూ వినియోగ దారులు, విద్యుత్ సంస్థల ప్రయోజనాలను కాపాడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తదితరులు పాల్గొన్నారు. మరో ఇద్దరు ఈఆర్సీ సభ్యుల నియామకానికి ప్రభుత్వం త్వరలో ప్రకటన జారీ చేయనుంది.

చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు బెదిరింపు కాల్

- రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్

కొత్తపల్లి (కరీంనగర్): కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశామని కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకట రమణ తెలిపారు. ఎమ్మెల్యే సత్యంకు ఈ నెల 28న మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో గుర్తు తెలియని నంబరు +447886696497 నుంచి వాట్సాప్ కాల్ వచ్చిందని వెల్లడించారు. ఫోన్‌లో సదరు వ్యక్తి మాట్లాడుతూ తనకు రూ.20 లక్షలు చెల్లించాలని, లేదంటే రాజకీయంగా అప్రతి ష్టపాలు చేసి తన ఇద్దరు పిల్లలు అనాథ లయ్యేలా చేస్తానని బెదిరింపులకు గురిచే సినట్లు తెలిపారు. దీంతో సత్యం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈమేరకు 339/ 2024, భారతీయ న్యాయ సంహిత 308, 351 (3), (4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి నట్లు తెలిపారు. నిందితుడు రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌లోని భవా నీనగర్‌కి చెందిన యాస అఖిలేశ్‌రెడ్డి (33) అని, ఇతడు ప్రస్తుతం లండన్‌లో ఉన్నాడని, అక్కడి నుం చి బెదిరింపులకు పాల్పడ్డట్లు తేలిందని వివరించారు. సదరు నిందితుడిపై బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీచేశామని ఏసీపీ వెల్లడించారు.

మెడికల్ పీజీ కోర్సులకు నేటి నుంచే దరఖాస్తులు

- అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసిన కాళోజీ వర్సిటీ
- దరఖాస్తులు ముగిశాక దశలవారీగా కౌన్సెలింగ్
- అల్లోపతి, ఆయుర్వేద, హోమియో కోర్సులకు అడ్మిషన్లు
- జాతీయ కోటా పోగా మిగతా సీట్లన్నీ తెలంగాణ వాసులకే..
- నిబంధనలు, అర్హత వివరాలను వెల్లడించిన విశ్వవిద్యాలయం
- ఆయుర్వేద, హోమియో, యునాని ఎండీ కోర్సుల్లో ప్రవేశాలకూ నోటిఫికేషన్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎట్టకేలకు మెడికల్ పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైం ది. 2024–25 సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎండీ, ఎంఎస్, డిప్లొమా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. కాళోజీ వర్సిటీకి, నిమ్స్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో దీనిద్వారా సీట్లను భర్తీ చేస్తారు. నీట్ పీజీ–2024లో అర్హత పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో గురువారం (31–10–2024) ఉదయం 6 గంటల నుంచి వచ్చే నెల ఏడో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. స్కాన్‌చేసిన సర్టిఫికెట్లను https://tspgmed.tsche.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. రాష్ట్ర స్థాయి మెరిట్‌ను నిర్ణయించి కన్వీనర్ కోటా అడ్మిషన్లను చేపడతారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన అన్ని సర్టిఫికెట్లను పరిశీలించిన తర్వాత.. తాత్కాలిక తుది మెరిట్ జాబితా ప్రదర్శిస్తారు. పీజీ మెడికల్ కోర్సుల కోసం నీట్ పీజీ–2024 పరీక్షలో కటాఫ్ స్కోర్‌గా.. ఓపెన్ కేటగిరీకి 50 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 40 పర్సంటైల్, ఓసీల్లో వైకల్యం ఉన్నవారికి 45 పర్సంటైల్‌ను ఖరారు చేశారు. కాగా.. ఎండీ ఆయుర్వేద, హోమియో, యునాని కోర్సుల్లో ప్రవేశాలకు కూడా నోటిఫికేషన్లు జారీచేశారు. వాటికి బుధవారం సాయంత్రం 4 గంటల నుంచే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే నెల ఐదో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఐఏపీజీఈటీ–2024 పరీక్షలో అర్హత సాధించినవారు ఈ మూడు కోర్సుల్లో చేరేందుకు అర్హులు.

నోటిఫికేషన్‌లోని ముఖ్యాంశాలివీ..

- అభ్యర్థులు స్థానికులై ఉండాలి. అంటే ఇప్పటివరకు వరుసగా నాలుగు సం వత్సరాలకు తక్కువ కాకుండా తెలంగాణలో చదివి ఉండాలి. అలాగే విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో చదివిన తెలం గాణ విద్యార్థులను కూడా ఇక్కడి స్థానికులుగానే భావిస్తారు.
- తెలంగాణలో ఇప్పటివరకు అంచనా వేసిన ప్రకారం.. 26 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 2,800 పీజీ మెడికల్ సీట్లున్నాయి. అందులో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లలో 50శాతం జాతీయ కోటా కౌన్సెలిం గ్‌లో భర్తీ చేస్తారు. మిగతా సీట్లను తెలంగాణ స్థానికులకు కేటాయిస్తారు.
- తెలంగాణలో స్థానికేతర కోటా కింద ఎం బీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులకు స్థానికత వర్తించదు.
- ఎంబీబీఎస్ పూర్తి చేసినవారు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి, లేదా అంతకుముం దే ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి.
- ఇన్–సర్వీస్ కోటా అభ్యర్థుల విషయంలో.. ప్రభుత్వంలో వారు చేసిన ఉద్యోగాన్ని గత నెల 30వ తేదీ వరకు పరిగణనలోకి తీసుకుం టారు.
- ఇతర రాష్ట్రాల అభ్యర్థులు కన్వీనర్ కోటా సీట్లకు అర్హులు కారు.
- పీజీ, డిప్లొమా కోర్సులకు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు కలిపి ఓసీ, బీసీలు రూ.5,500, ఎస్టీలు రూ.5 వేలు చెల్లించాలి.
- ఆయా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన వెబ్ ఆప్షన్ల తేదీలను త్వరలో వెబ్‌సైట్లో వెల్లడిస్తారు.
- నీట్ పీజీ పరీక్షలో కటాఫ్ స్కోర్ కంటే ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
- దరఖాస్తుల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే.. 9392685856, 7842136688, 9059672216 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. లేదా knrpgadmissions@gmail.com కు ఈ–మెయిల్ చేయవచ్చు.



నల్లగొండ పట్టణ పరిధిలో జలమయమైన ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రం

వర్షపు నీటిలో ధాన్యపు రాశులు

రామన్నపేట/నల్లగొండ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా, నల్లగొండ జిల్లా బుధవారం కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం తడిసిపోయింది. భువనగిరి జిల్లా రామన్న పేట మండల కేంద్రం తోపాటు పలు గ్రామాల్లో రాత్రి ఉరు ములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయింది. రామన్నపేట వ్యవసాయమార్కెట్‌లో సీసీ ప్లాట్‌ఫారంపై పోసిన ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. ఇక నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలో కురిసిన భారీ వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోయిం ది. ఆర్జాల బావిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం జలమయమైం ది. ఖాజీరామారం, కొత్తపల్లి సెంటర్లలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ గాలి, ధాన్యం బస్తాల కిందకు వర్షపు నీరు చేరి తడిశాయి. ధాన్యపు రాసుల మధ్య చేరిన వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు రాత్రి సమయంలో తీవ్రంగా శ్రమిం చాల్సి వచ్చింది.

మయోనైజ్‌పై నిషేధం

▶ మొదటి పేజీ తరువాయి

వాటితో కూడా కలిపి తీసుకుంటుంటారు.

మంత్రి సమీక్ష నేపథ్యంలో.. : ఆహార భద్రతపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామో దర రాజనర్సింహ బుధవారం సమీక్ష నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీల పనితీ రుపై ఆరా తీశారు. 235 హోటళ్లు, హాస్టళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, గోడౌన్లలో తనిఖీలు చేశా మని, 170 సంస్థలకు నోటీసులు ఇచ్చామని జీహెచ్ఎంసీ టాస్క్‌ఫోర్స్ అధికారులు వివరించారు. దీంతో జిల్లాల్లోనూ విరివిగా తనిఖీలు చేయాలని, ఇందుకోసం రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించాలని మంత్రి సూచించారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మోమోస్ తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై మంత్రి ఆరా తీ శారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో కలిపి తినే మయోనైజ్‌ను కల్తీ గుడ్లు, ఉడకబె ట్టని గుడ్లతో తయారు చేస్తున్నారని, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోం దని అధికారులు వివరించారు. మయోనైజ్ క్వాలిటీ, అది తిన్న తర్వాత కలిగిన దుష్ప రిణామాలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కేరళలో ఈ తర హా మయోనైజ్ తయారీని అక్కడి ప్రభుత్వం నిషేధించిందని, రాష్ట్రంలో కూడా నిషే. దం విధించాలని సూచించారు. దీంతో పలువురు డాక్టర్లు, ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారు లతో చర్చించిన మంత్రి.. మయోనైజ్‌పై నిషేధం విధించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఆహార భద్రతపై అధ్యయనం చేయండి

రాష్ట్రంలో గత పదేళ్లలో హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, హాస్టళ్ల సంఖ్య భారీగా పెరిగింద ని, ఇందుకు అనుగుణంగా ఆహార భద్రతా విభాగం బలోపేతం కాలేదని, కొత్త పోస్టులు మంజూరు కాలేదని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో ఫుడ్ సేఫ్టీలో ముందున్న రాష్ట్రాలు, దేశాల్లో అవలంభిస్తున్న పద్ధతులపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా మంత్రి అధికారులను ఆదేశించారు. కొత్తగా మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయబోతున్నామని, 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ అందుబాటు లోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు కలెక్టరే ట్లలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ కమిష నర్ కర్ణన్, డైరెక్టర్ శివలీల, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు మూర్తి రాజు, అమృత, ధర్మేం ద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ నాయుడుకు టీటీడీ చైర్మన్ పదవి

సాక్షి, అమరావతి/హైదరాబాద్: టీవీ–5 అధినేత బీఆర్ నాయుడికి చంద్రబాబు టీటీడీ (తిరుమల తిరుపతి దేవ స్థానం) చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఆయనతోపాటు మరో 23 మందిని సభ్యులుగా నియమిస్తున్నట్లు బుధవారం టీడీపీ ప్రకటించింది. సభ్యులుగా జగ్గంపేట, కోవూరు, మడకశిర ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంఎస్ రాజు, టీడీపీ నేత పనబాక లక్ష్మి, సాంబశివ రావు (జాస్తి శివ), నన్నపనేని సదాశివరావు, కోటేశ్వర రావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, శాంతా రాం, పి.రామ్మూర్తి, తమ్మిశెట్టి జానకీదేవి, నరేశ్ కుమార్ ని యమితులయ్యారు. తెలంగాణ నుంచి నల్లగొండకు చెంది న టీడీపీ నేత నన్నూరి నర్సిరెడ్డి, జనసేన పార్టీ నేత బుం గునూరు మహేందర్‌రెడ్డి, సినీ ఆర్ట్ డైరెక్టర్, యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణంలో ఆర్కిటెక్ట్‌గా వ్యవహరించిన బురగపు ఆనంద్‌సాయి, భారత్ బయోటెక్ కో చైర్మన్ సుచి త్ర ఎల్లా, అనుగోలు రంగశ్రీకి అవకాశం ఇచ్చారు. కర్ణాటక నుంచి జస్టిస్ హెచ్ఎల్ దత్, దర్శన్ ఆర్ఎన్, గుజరాత్ నుం చి డాక్టర్ అదిత్ దేశాయ్, మహారాష్ట్ర నుంచి సౌరబ్ హెచ్ బోరా, తమిళనాడు నుంచి కృష్ణమూర్తిని నియమించారు. కాగా ఈ జాబితాపై టీడీపీలో చాలామంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమకు కచ్చితంగా బోర్డులో అవకాశం దక్కుతుందని భావించిన చాలామం దికి నిరాశే ఎదురవడంతో వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక వడపోతలు, సమీకరణలు పరిశీలించి చంద్రబాబు ఈ జాబితా రూపొందించినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత టీటీడీ బోర్డును నియమిస్తుండడం విశేషం.

సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు, ఇతర పాలకమండలి సభ్యులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి అభినందనలు తెలిపారు.



సుచిత్ర ఎల్లా : భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమి టెడ్ కో చైర్మన్‌గా వ్యవహరిస్తు న్నారు. కోవిడ్ టీకా కోవాగ్జిన్ రూపొందించినందుకు గాను ఆమెకు, ఆమె భర్త, ఆ సంస్థ సీఎం డీ కృష్ణా ఎల్లాకు భారత ప్రభుత్వం 2022లో పద్మభూషణ్ పురస్కా రాన్ని ప్రదానం చేసింది. సుచిత్ర స్వస్థలం తమిళ నాడులోని తిరుత్తణి. కానీ తెలంగాణ కోటాలో ఆమెను టీటీడీ బోర్డు మెంబర్ పదవి వరించింది.

ఆనంద్ సాయి



తెలుగు చలనచిత్ర రంగంలో కళాద ర్శకుడిగా మంచి గుర్తింపు సంపాదిం చిన ఆనంద్‌సాయి జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితుడు. పవన్‌కళ్యాణ్ నటిం చిన పలు చిత్రాలకు ఆయన కళాదర్శకుడిగా వ్యవహరిం చారు. రంగారెడ్డి జిల్లాలో చిన జీయర్‌స్వామి ఆశ్రమ రూప కల్పనలో పాల్గొన్నారు. అనంతరం యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణం కోసం ఆర్కిటెక్ట్‌గా నియమితులయ్యారు. పవన్‌కళ్యాణ్ సూచనతో టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అవకాశం దక్కింది.

బొంగునూరి మహేందర్‌రెడ్డి



హైదరాబాద్ శివారులోని కొంపల్లికి చెందిన బొంగునూరి మహేందర్ రెడ్డి కూడా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు సన్నిహితుడు. ఆ పార్టీ ఆవిర్భావానికి ముందు నుం చే ఆయన పవన్‌తో కలిసి నడుస్తున్నారు. తొలుత ప్రజారా జ్యం పార్టీలో కొనసాగి, జనసేన ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో మల్కా జిగిరి లోక్‌సభ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పుడు పవన్ సూచన మేరకు ఆయనకు టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అవకాశం దక్కింది.

నన్నూరి నర్సిరెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా సిరి పురం గ్రామానికి చెందిన నర్సిరెడ్డి ముందునుంచి తెలుగుదేశం పార్టీ లో క్రియాశీలంగా ఉంటూ చం ద్రబాబుకు సన్నిహితుడిగా ముద్ర పడ్డారు. టీఎన్ఎస్ఎఫ్‌తో రాజకీయ ప్రస్థానం మొదలుపె ట్టారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

ప్రశ్నిస్తే.. పోలీసులతో కొట్టిస్తారా?



వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నిస్తే పోలీసులతో కొట్టిస్తారా అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మం డిపడ్డారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభు త్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని బీఆర్ఎస్ నాయకుడు వర్ధ భాస్కర్‌ను పోలీస్‌స్టేషన్‌కి పిలిపిం చి వన్‌టౌన్ సీఐ అప్పయ్య కొట్టాడని నిరసిస్తూ బుధవారం బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సం దర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెట్టినందుకు సీఐ అప్పయ్య స్టేషన్‌లో బూతులు తిడుతూ కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. బూతులు తిడుతూ కొట్టి.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడ మేనని అన్నారు. చట్టపరిధిలో పనిచేయాల్సిన అధి కారులు.. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసి పోలీస్ వ్యవస్థకి చెడ్డపేరు తీసుకువస్తున్నారని మం డిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలో వస్తుందని, చట్టాన్ని అతిక్రమించి పని చేసిన అధి కారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా.. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆం దోళన విరమించారు. ధర్నాలో నాయకులు ఆంజ నేయులు, రవి, రాజుసాగర్, కిషోర్, శివరాజ్, తది తరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో భాస్కర్‌ను పరామర్శించిన కేటీఆర్..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధ వారం వర్ధభాస్కర్‌ను ఫోన్‌లో పరామర్శిం చారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తే భయపడ వద్దని చెప్పారు. సీఐపై చట్టప్రకారం ముం దుకు వెళ్తామని, ఎస్పీతో మాట్లాడుతానని కేటీ ఆర్ చెప్పారు.

మళ్లీ పెరిగిన ఉల్లి ధర

- క్వింటా గరిష్టంగా రూ.2,810.. కనిష్టంగా రూ.1,360



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి బస్తాలు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఉల్లి బహిరంగ వేలంలో గత వారంతో పోలిస్తే ధరలు కొంత పెరిగాయి. వానాకాలంలో పండించిన ఉల్లిని వివిధ గ్రామాల రైతులు విక్రయించేం దుకు బుధవారం మార్కెట్‌కు తీసుకొచ్చారు. సుమారు 200 బస్తాల ఉల్లి అమ్మకానికి రావడం తో వ్యాపారులు పోటీపడి వేలంలో పాల్గొన్నారు.

జోరుగా సాగిన వ్యాపారం..

మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని వ్యాపారులు బహిరం గ వేలంలో కొనుగోలు చేశారు. స్థానిక వ్యాపారు లతో పాటు వివిధ ప్రాంతాల వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. క్వింటా గరిష్టంగా రూ.2,810.. కనిష్టంగా రూ.1,360 ధర పలి కాయి. గరిష్ట ధర గత వారం కంటే రూ.210.. కనిష్ట ధర రూ.260 వరకు పెరిగింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కిలోల ఉల్లి బస్తా ధర గరిష్టంగా రూ.1,400, కనిష్టంగా రూ.700 వరకు విక్రయించారు.

■ దేవరకద్ర మార్కెట్‌లో ఆర్ఎన్ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,262, కనిష్టం గా రూ.1,922గా పలికింది. హంస ధాన్యం గరిష్టంగా రూ.1,932, కనిష్టంగా రూ.1,979గా ధరలు నమోదయ్యాయి. ధాన్యం సీజన్ ప్రారం భం కావడం వల్ల మార్కెట్‌కు దాదాపు 5 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. కాగా.. దీపావళి, అమావాస్య కారణంగా మార్కెట్‌కు గురు, శుక్రవారం సెలవు ప్రకటించారు. తిరిగి 2వ తేదీ శనివారం మార్కెట్‌లో లావాదేవీలు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

కాంచనగుహకు ఉత్సవ శోభ

నేటి నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక పూజలు

- 2 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 6న అలంకారోత్సవం
- 8న మహాఘట్టం ఉద్దాల ఉత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం



స్వామివారి మూల విగ్రహం

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు 2వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా.. నేటి నుం చే ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వ హించనున్నారు. అమావాస్య మరుసటి రోజు పాడ్యమిని పురస్కరించుకొని నిర్వహించే బ్రహ్మో త్సవాలకు తెలంగాణతో పాటు ఆంధ్ర, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. దీంతో కాంచనగుహ గోవిం ద నామస్మరణతో మార్మోగనుంది.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా..

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణమంతా రంగులద్దే పనులు పూర్తికాగా.. విద్యుత్ దీపాలతో అలంకరిస్తు న్నారు. ఆలయ అర్చకులు స్వామివారు విహరించే వాహనాలను శుద్ధిచేసి సిద్ధం చేశారు. అక్కడక్కడ హైమాస్ట్ లైట్లతో పాటు వీధి దీపాలు అమర్చుతు న్నారు. జాతర మైదానంలో ఉన్న మంచి నీటి ట్యాంకులు శుభ్రపర్చారు. కొళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని అందించనున్నారు. జాతర ప్రాం గణంలో పారిశుద్ధ్య పనులు, మరుగుదొడ్లు, అక్క డక్కడ తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేసేం దుకు చర్యలు చేపడుతున్నారు. ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరుగకుండా ఆలయ ముఖ ద్వారం నుంచి ఉద్దాల గుండు వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి జాతర ప్రాంగణంలో సీసీ కెమెరాలు అమర్చనున్నారు.

అలంకారోత్సవం.. ప్రత్యేకం...

ముక్కెర వంశీయులు బహూకరించిన స్వర్ణాభరణా లను నెలరోజుల పాటు స్వామివారికి అలంకరించ డమే అలంకారోత్సవం. వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లోని ఎస్‌బీఐ లాకర్‌లో భద్రపర్చిన స్వామివారి ఆభరణాలను పోలీస్ బందోబస్తు మధ్య ఊరేగింపుగా కొత్తపల్లి, దుప్పల్లి మీదుగా అమ్మాపురం సంస్థానధీశులు రాజా శ్రీరాంభూ పాల్ ఇంటికి చేరుస్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి అంబోరు మధ్యన కాలినడకతో కురు మూర్తి గిరులకు తరలిస్తారు. ఈ కార్యక్రమం 6వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

8న ఉద్దాల ఉత్సవం..

స్వామివారి ఉత్సవాల్లో ఉద్దాల ఉత్సవం ఓ ప్రత్యేక ఘట్టం. చిన్నవడ్డెమాన్‌లో దళితులు వారం పాటు భక్తిశ్రద్ధలతో తయారు చేసిన పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అప్పం పల్లి, తిర్మలాపూర్ మీదుగా ఊరేగింపుగా కురుమూర్తి గిరులకు చేరుస్తారు. ఊరేగింపులో శివసత్తుల విన్యాసాలు, గోవింద నామస్మరణతో మార్మోగుతాయి. ఈ ఉత్సవానికి లక్షలాది మం ది భక్తులు తరలివస్తారు.



స్వామివారి ఊరేగింపునకు సిద్ధం చేసిన వాహనాలు



అమ్మాపురం కురుమూర్తిస్వామి ప్రధాన ఆలయం



రంగురంగుల విద్యుద్దీపాలతో రాజ గోపురం

ఇవీ కార్యక్రమాలు..

గురువారం ఉదయం యాగశాల మండపాలంకరణ, ప్రత్యేక పూజలు
1న హోమం, ప్రత్యేక పూజలు
2న ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరిపూ జ, అష్టోతర శతకలశాభిషేకం, స్వామి వారి కల్యాణం, మహా నివేదన, మంగళ నీరాజ నం, సాయంత్రం 6.15 గంటలకు భూ సమేత స్వామివారి మయూర వాహన సేవ.
3న ఉదయం హోమం.. సాయంత్రం 6.20కి హంస వాహనసేవ
4న సాయంత్రం 6.25 గంటలకు శేష వాహ నసేవ
5న సాయత్రం 6.30కి గజ వాహనసేవ
6న స్వర్ణాభరణాలతో అలంకారోత్సవం, రాత్రి 9.45కు అశ్వ వాహనసేవ
7న రాత్రి 10 గంటలకు హనుమద్ వాహన సేవ
8న సాయంత్రం 6.30కి ఉద్దాల ఉత్సవం.. రాత్రి 10.15 గంటలకు గరుడ వాహనసేవ
09న పుష్పయాగం, ప్రత్యేక పూజలు
10న ప్రత్యేక పూజలు
18న 9.45 గంటలకు ఆభరణా తొలగింపు.

భక్తులకు ఇబ్బందులు రావొద్దు

- కలెక్టర్ విజయేందిర బోయి
- జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఉత్సవా లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం చిన్నచింతకుంట మండలం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని స్వామి వారిని దర్శించుకునేం దుకు లక్షలాది మంది భక్తులు హాజరవుతారన్నారు. అందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మంచి నీటి కొరత, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడా లన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. నూతనంగా నిర్మించే మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మాణం త్వరగా చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది అందు బాటులో ఉంటూ కాంపు లు నిర్వహించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుం డా పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుం డా చర్యలు చేపట్టాలన్నారు. కోనేరులో ఎప్పటిక ప్పుడు నీటిని శుభ్రంగా ఉంచాలన్నారు. అధికా రులు ఎప్పటికప్పుడు పర్యావేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పీ రాములు, ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



కోనేరు వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి